బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు గొప్ప నిర్ణయం
● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
6

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్
8



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

# ప్రోత్సాహానికి తప్పని ఎదురు చూపులు..

- కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నిరాశ
- నిధులు రాక అందని ప్రోత్సాహకం
- జిల్లాలో ఎదురుచూస్తున్న 185 జంటలు



జగిత్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలను చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహం అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహ సొమ్ము కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. దీంతో ఆదర్శ వివాహాలకు ఆదరణ కరువు అవుతోంది. కులాంతర పెళ్లిళ్ల చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామన్న ప్రభుత్వం నుంచి ఆ నిధులు విడుదల కావడం లేదు. షెడ్యూల్ కులానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే ఆర్థికసాయాన్ని అందిస్తారు. ఇది వరకు రూ. 50వేలు ఉన్న ఆర్థికసాయాన్ని గత ప్రభుత్వం 2019 నవంబరులో రూ.2.50లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఆదర్శ దంపతులకు సంబంధించిన ప్రోత్సాహకాలకు నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడంలేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సాయం సకాలంలోఅందక ఇబ్బందులు పడుతున్నారు.

**● 253 దరఖాస్తులు...**

జిల్లాలో ఆదర్శ వివాహాలు చేసుకున్న 253 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో 68 జంటలకే సాయం అందింది. ఇంకా 185 జంటల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వారికి ఆర్థికసాయం అందాల్సి ఉంది. గతంలో ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం పెంచినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఆదర్శవివాహాలు చేసుకున్న దంపతులకు నిరాశే ఎదురవుతోంది. కుల ప్రాతిపదికన సమాజంలో అసమానతలను తొలగించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకానికి నిధుల కొరత ఇబ్బందులు కలిగిస్తోంది.

**● అర్హులు వీరే...**

ఆదర్శ కులాంతర వివాహం చేసుకున్నవారు ఆర్థిక సాయం పొందాలంటే పలు అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పకుండా షెడ్యూల్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్ల కచ్చితంగా నిండి ఉండాలి. వివాహ చట్టం ప్రకారం రిజిష్టర్ అయి ఉండాలి. పెళ్లయిన జంట వార్షిక ఆదాయం ఐదులక్షల రూపాయల కంటే తక్కువగా ఉండాలి. మొదటి వివాహానికి మాత్రమే ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాదిలోపు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుంది.

**● అవసరమైన ధ్రువీకరణ పత్రాలు...**

వేర్వేరు కులానికి చెందిన యువతీ యువకులు పెళ్లికి సంబంధించిన ఆధారాలతో షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వెంటనే..

మిగతా 8లో

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర్య దినోత్సవం-2026ను పురస్కరించుకొని పద్మ అవార్డుల కోసం జిల్లా నుంచి అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజంలోని బలహీనవర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీలతో పాటు దివ్యాంగుల ప్రతిభావంతుల యొక్క వివరాలు గుర్తించబడతాయన్నారు. గతంలో అవార్డు పొందిన వారికి కనీసం ఐదేళ్ల వ్యత్యాసం ఉండాలని, ఈ అవార్డులు వైద్యులు, శాస్త్రవేత్తలు తప్ప ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు అనర్హులన్నారు. పైవిషయాలను దృష్టిలో ఉంచుకొని జ్టిఇ//ఇచీర్ఘ్సుటీటచీటఆౌ.జీ అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి డా. కోరుకంటి రవికుమార్ తెలిపారు.

## సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

ధర్మపురి, జూలై 17 (ఆంధ్రజ్యోతి ): సీనియర్ సిటిజన్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను వారు కలిసి వినతి పత్రాన్ని అందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

రాయికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపిక చేసిన 144 మంది లబ్ధిదారులకు గురువారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాయికల్ పట్టణంలోని గుడేటి కాపు సంఘ భవనంలో 12 వార్డుల ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఇందిరమ్మ ఇళ్ల గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ వెంకటి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ఏఈ తిరుమల, వార్డు అధికారులు పాల్గొన్నారు.

**బీర్‌పూర్:** మండలంలోని మంగేళ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీడీవో భీమేష్, కార్యదర్శి రవి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.

## ఓడీఎఫ్ ప్లస్ పట్టణంగా రాయికల్ మున్సిపాలిటీ

రాయికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్-2024-25 కార్యక్రమంలో రాయికల్ పట్టణం ఓడీఎఫ్ నుంచి ఓడీఎఫ్ ప్లస్ పట్టణంగా గ్రేడింగ్ సాధించిందని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణలో, వ్యాపార ప్రాంతాల్లో పారిశుధ్యం, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ వంటి అంశాల గురించి సర్వే ద్వారా ఓడీఎఫ్ ప్లస్ పట్టణంగా గ్రేడింగ్ సాధించామన్నారు. వన్ స్టార్ రేటింగ్ సాధించిందన్నారు. గ్రేడింగ్ వలన పట్టణానికి అదనపు నిధులు సమకూరుతాయని, దీంతో పట్టణ పారిశుధ్యం మరింత మెరుగుపరచవచ్చునని తెలిపారు.

## కేంద్రమంత్రిని కలిసిన 'కొండగట్టు' అధికారులు


కేంద్రమంత్రి సంజయ్‌తో కొండగట్టు దేవస్థానం అధికారులు

మల్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం అధికారులు బుధవారం కరీంనగర్‌లోని క్యాంప్ ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ వంద గదుల నిర్మాణానికి, అభివృద్ధి పనులకు టీటీడీ నుంచి ఐదు కోట్ల రూపాయల నిధుల మంజూరికి కృషి చేయాలని కోరారు. అంతకు ముందు ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. దేవస్థానం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అభివృద్ధిలో దాతల సహకారం కూడా తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు చంద్రశేఖర్, హరిహరనాథ్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

**జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్**

జగిత్యాల క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సురక్షిత ప్రయాణం అనే కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో పట్టణ పోలీసులు గురువారం అమలుచేశారు. ఈ సందర్భంగా నటరాజ్ చౌరస్తా సమీపంలో స్పీడ్ బ్రేకర్ నిర్మాణాన్ని చేపట్టారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశం తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

కోరుట్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని మాదాపూర్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో కలిసి మొక్కలను నాటి వాటికి ట్రీగార్డును ఏర్పాటు చేశారు. అదే విధంగా గ్రామంలో నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి ప్రభుత్వ నిబందలను పాటించాలని లబ్ధిదారులకు సూచించారు. మాజీ ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, పడాల లచ్చయ్య, కార్యదర్శి అపర్ణ పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులను పరామర్శించిన కలెక్టర్


విద్యార్థినిని పరామర్శిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురికాగా కలెక్టర్ సత్యప్రసాద్ విద్యార్థులకు వైద్యం అందిస్తున్న మాతా శిశు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ చిన్నారులకు ఎలాంటి అపాయం లేదని, ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, ఆర్ఎంవో సుమన్ రావు తదితరులు ఉన్నారు.

**పట్టణంలో విస్తృత పర్యటన**

జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో డ్రైవ్ క్లీనింగ్ శానిటేషన్‌లో భాగంగా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం జగిత్యాల పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 27వ వార్డులో నాలా సమస్యలను పరిశీలించారు. అక్రమ కట్టడాలు ఉంటే కోర్టు నోటీసులు ఇవ్వాలని నీటి పారుదల శాఖ రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. ధరూర్ క్యాంప్ రామాలయం దగ్గర మేజర్ నాలాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. జగిత్యాల మున్సిపాలిటీలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద నగరంలో వ్యర్థాల నివారణ, డ్రైయిన్లు, వాగులు ప్రభుత్వ భూములు శుభ్రపరిచే పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాంచారు. రామాలయం పక్కన ఉన్న పెద్ద నాలా ఎస్సారెస్పీ కాలువ వద్ద శంకులపల్లి సోడా సెంటర్ ప్రాంతాలను శుభ్రపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కార్యక్రమాలను డ్రైవ్ మోడ్‌లో తీసుకోవాలని మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రైవేట్ భూయజమానులు తమ భూముల్లో చెట్లను, ముళ్ల పొదలను తొలగించకపోతే జరిమానాలు విధించి ఆ డబ్బుతో శుభ్రత పనులు చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**-అదనపు కలెక్టర్ బీఎస్ లత**

కొడిమ్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులు అందిస్తామన్నారు. ఆరోగ్య ఉపకేంద్రం, నర్సరీని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం పనులను ముమ్మరంగా చేయాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అవగాహన కలిపించాలన్నారు. మహిళలకు రక్తహీనత పరీక్షలను నిర్వహిస్తూ సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామంలో జ్వర సర్వే చేయాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతీగ్రామంలో మొక్కలను నాటాలన్నారు. నాటిన మొక్కలను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో మదన్‌మోహన్, ఎంపీడీవో ఇస్వరూప, తహసీల్దార్ ఎం కిరణ్‌కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

**ప్రభుత్వ నిబంధనలు లబ్ధిదారులకు వివరించాలి**

**కోరుట్ల రూరల్:** ప్రభుత్వ నిబంధనలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వివరించి అవగాహన కల్పించాలని జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి మండల స్థాయి అధికారులకు సూచించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిమ్మ ఇళ్ల నిర్మాణ నమూనా భవనానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులకు గౌతమ్ రెడ్డి పలు సూచనలు సలహాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, డీఈ భాస్కర్, ఎంపీవో కృపాకర్, ఏఈ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## రహదారులపై పారుతున్న మురుగునీరు

**- మురుగుకాలువలు లేక ఇబ్బందులు**


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

జగిత్యాల అర్బన్ జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో పలు ప్రాంతాల్లో మురికి కాలువలు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని గణేష్ నగర్ ప్రాంతంలో మురికి కాలువలు నిర్మించకపోవడం వల్ల మురికి నీరు నివాస గృహాల మధ్యలో నిలిచి దుర్వాసన వెదజల్లడంతో పాటు ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారు. నర్సింగాపూర్ రోడ్డులోని సప్తగిరి కాలనీలో గురువారం కురిసిన కొద్ది పాటి వర్షానికే రోడ్డుపైకి మురికినీరు చేరడంతో ఈ ప్రాంత వాసులు నడవడానికి ఇబ్బందులు పడ్డారు. సమస్యలపై గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. మురికి కాలువల పరిశీలనకు వచ్చిన వార్డు ఆఫీసర్ మురికి కాలువ తమ పరిధి కాదని ఆర్అండ్‌బీ అధికారులదని చెప్పడం గమనార్హం.

## దళిత యువకుడి హత్య కలకలం

వెల్గటూర్, జూలై 17( ఆంధ్రజ్యోతి): తమ అమ్మాయిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఓ దళిత యువకుడిని అమ్మాయి బంధువులు హత్య చేసిన సంఘటన వెల్గటూర్ మండలంలో కలకలం సృష్టించింది. మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన సల్లూరి మల్లేష్ (26) అనే దళిత యువకుడు గురువారం హత్యకు గురయ్యాడు. మల్లేష్ అదే గ్రామానికి చెందిన ఓ బీసీ యువతిని ప్రేమించాడు. విషయం తెలిసిన యువతి కుటుంబసభ్యులు గతంలో మల్లేష్‌పై వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. తనను కులం పేరుతో దూషించాడని యువతి తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మల్లేష్ యువతి ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. యువతి తండ్రి, బాబాయి, మరొక వ్యక్తి వెల్గటూర్ మండల కేంద్రంలో యువకుడిని హత్య చేశారు. మృతుడు మల్లేష్ తండ్రి ఫిర్యాదు మేరకు యువతి తండ్రి రాజిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# గురుకులాల్లో విద్యార్థులకు రక్షణ కరువు

**జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్**

జగిత్యాలరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గురుకులాల్లో రక్షణ కరువైందని, వారి ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో అస్వస్థతకు గురై ఫుడ్‌పాయిజన్‌తో జగిత్యాల ఎంసీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలను నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్, అర్బన్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఆనందం, గంగాధర్, నాయకులు రాజన్న, శంకర్, ప్రశాంత్‌రావు, హరీష్, ప్రణయ్, షఫీ, సాయి, బాలె చందు, బషీర్, పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హయాంలో గాడితప్పిన గురుకులాలు**

**మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్**

కాంగ్రెస్ పాలనలో గురకుల పాటశాలలు గాడి తప్పాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల బీసీ హస్టల్‌లో బుధవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై స్పందించారు. ఈసందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ గురుకులంలో కల్తీ ఆహారం తిని 30 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ గురుకులంలో ఏ వార్త వినాల్సివస్తుం దోనని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. సమస్యలకు మూల కారణాలు తెలుసుకుకొని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.


విద్యార్థినిని పరామర్శిస్తున్న దావ వసంత

# ఉపాధ్యాయురాలి బదిలీ నిలిపివేయాలని నిరసన

**- ఎమ్మెల్యే చొరవతో నిలిచిన బదిలీ**


పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మల్లాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయురాలిని బదిలీ చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు నిరసన చేపట్టారు. గురువారం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయురాలిని సర్దుబాటులో భాగంగా వేరే చోటుకు బదిలీ చేసిన విషయాన్ని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో 142 విద్యార్థులకు నిబంధనల ప్రకారం ఉండగా వేరేచోటుకు బదిలీ చేస్తే విద్యార్థులు నష్టపోతారని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉపాధ్యాయురాలి బదిలీ నిలిపివేయాలని పాఠశాల ఎదుట నిరసన తెలిపారు.

గ్రామానికి చెందిన అల్‌యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేష్‌యాదవ్ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు ఫోన్ ద్వారా సమస్యను తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే టీచర్‌ను బదిలీచేయడం వలన విద్యార్థులు నష్టపోతారని, వెంటనే బదిలీని నిలిపివేయాలని డీఈవో, ఎంఈవోలకు ఫోన్ ద్వారా సమస్యను తెలిపారు. దీంతో అధికారులు టీచర్ బదిలీ నిలిపివేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చేసిన పనులతోనే సిట్ నోటీసులు

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కేసీఆర్ చేసిన పనులతోనే సిట్ నోటీసులు అందుకోవాల్సి వచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం సిట్ నోటీసులపై ఆయన మాట్లాడారు. తనతోపాటు కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను సైతం ట్యాప్ చేశారన్నారు. భార్యాభర్తలు పడకగదిలో మాట్లాడుకునే మాటలను సైతం ట్యాప్ చేసి ఎంతోమంది జీవితాలను నాశనం చేసిన కుటుంబం కేసీఆర్‌దే అన్నారు. తనకు తెలిసిన సమాచారాన్ని సిట్‌కు అందజేస్తానన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌పై వ్యవహారంపై మొట్టమొదట గళం విప్పింది తానే అన్నారు. తనతోపాటు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, జడ్జిలు, ప్రతిపక్షపార్టీల నాయకులు, సినీతారలతో పాటు, బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను కూడా కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసిందన్నారు. పదో తరగతి పేపర్ లీక్, 317 జీవో సవరించాలంటూ చేపట్టిన దీక్షను భగ్నం చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ ద్వారానే సమాచారం తెలుసుకున్నారన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు గొప్ప నిర్ణయం

● రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతగా బీసీ సామాజికవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సంక్షేమంకోసం చేసిన పనులు ఏమిటోచెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు అడ్రస్‌లేకుండా పోయిందని విమర్శించారు. బీసీలపై ప్రేమ ఉంటే బీసీ నేతను బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడిగా నియమించాలి కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నోకష్టాలను ఎదుర్కొని అధికారంలోకి వచ్చిందని, పార్టీలో వ్యక్తిగత కోపాలు ఫిరాయింపులకు చోటు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇతరపార్టీలు మనలో ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, కార్యకర్తలు అపోహలకు లోనుకాకుండా పార్టీపై నిబద్ధతతో ముందుకు సాగాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎమ్మెల్సీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకాంగ్రెస్ వ్యవసహారాల ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీని ఎదుర్కొనే సత్తా ఎవరికి లేదని అన్నారు. ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు, నిరుపేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ, అనేక సంక్షేమపథకాలు చేపట్టి సఫలీకృతుడయ్యాడని ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు అన్నిరంగాల్లో ముందుకు దూసుక వెళుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బలుమూరి వెంకట్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, గాలి అనిల్‌కుమార్, అంజన్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, రుద్ర సంతోష్, రహమత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహుడి సన్నిధిలో ఎమ్మెల్సీల పూజలు



ధర్మపురి నరసింహుడి సన్నిధిలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ దంపతులు

ధర్మపురి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దంపతులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గురువారం సందర్శించారు. ఆలయంవద్ద వారికి వేర్వేరుగా వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారందరు స్వామి సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారిద్దరికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అంతకుముందు వారు యమధర్మరాజు ఆలయంవద్ద గండ దీపంలో నూనెపోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేయగా ఒకరు పరారీ ఉన్నట్టు ఎస్‌ఐ ఆశోక్‌కుమార్ గురువారం తెలిపారు. జిల్లా సీసీఎస్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు పేకాట ఆడుతున్న వారిని గుర్తించి దాడి చేసినట్టు ఎస్ తెలిపారు. వారివద్ద 3,690రూపాయలు, ఏడు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

## జ్వరంతో యువకుడి మృతి

మల్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేటకు చెందిన నేరెళ్ల సాయికుమార్(22) అనేయువకుడు తీవ్రజ్వరంతో భాదపడుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న సాయికుమార్ జ్వరం బారినపడడంతో చికిత్స కోసం బుధవారం గ్రామానికి వచ్చి స్థానికంగా వైద్యం పొందాడు. జ్వరం తగ్గకపోవడంతో జగిత్యాలలోని ప్రైవేట్‌ఆసుపత్రులకు తీసుకెళ్లగా పరిస్థితి విషమించి అదేరోజు రాత్రి మృతిచెందాడు.

# తపాలా కార్యాలయాల్లో ఆధునిక సాంకేతికత




● సేవలు వేగవంతానికి చర్యలు

● కరీంనగర్ డివిజన్‌లో ఈ నెల 22 నుంచి ప్రారంభం

భగత్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ తపాలా శాఖ సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మరో ముందడుగు వేయనున్నది. రాష్ట్ర తపాలా శాఖ సర్కిల్, రీజినల్ కార్యాలయాల ఆదేశాల మేరకు కరీంనగర్ డివిజన్‌లోని అన్ని కార్యాలయాల్లో ఐటి 2.0 సాంకేతికతను అందుబాటులోకి తేనున్నారు. భారతీయ తపాలా శాఖ కొత్త సాంకేతికతను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే నల్గొండ డివిజన్, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్‌లలో జూలై 8వ తేదీన ప్రారంభించారు. మిగతా జిల్లాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ప్రస్తుతమున్న రెండు హెడ్ పోస్టాఫీసులు, 52 సబ్ పోస్ట్ ఆఫీసులు, 389 బ్రాంచి పోస్టాఫీసుల్లో కొత్త అధునాతన సాంకేతికతను అమలు చేయనున్నారు.

### డిజిటల్ సదుపాయాలు

తపాలా శాఖ ఆధ్వర్యంలో 2.0 సాంకేతికతతో పార్సిల్, సీఓడీ, వీపీపీ వంటి సేవల బట్వాడా వేగవంతమవుతుంది. దీనితో డిజిటల్ సిగ్నేచర్, ఆధునిక డిజిటల్ సదుపాయాలు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. తపాలా శాఖలో సేవల వేగవంతానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**ఆధునికీకరణ పనులతో లావాదేవీలకు అంతరాయం**

**కె శివాజీ, సూపరింటెండెంట్, పోస్టల్, కరీంనగర్**



తపాలా శాఖలో కొత్తగా చేపట్టనున్న 2.0 సాంకేతికత, ఆధునికీకరణ పనులతో ఈ నెల 18, 19 తేదీల్లో తయారీ పనులు, 21న పూర్తి స్థాయిలో తపాలా లావాదేవీలు నిలిపి వేయనున్నట్లు తపాలా శాఖ కరీంనగర్ సూపరింటెండెంట్ శివాజీ తెలిపారు. ప్రజలు, వినియోగదారులు తమ తపాలా లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ మార్పు వల్ల తాత్కాలికంగా కొంత అసౌకర్యం కలుగవచ్చని, వాటిని సమర్థవంతంగా అధిగమించి మెరుగైన సేవలు అందించేందుకు ఇది ఒక పెద్ద ముందడుగు అన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలే బుద్ధి చెబుతారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

● 42శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో మరోసారి ఘరానా మోసం

● తెలంగాణలో చంద్రబాబునాయుడు కోవర్టు పాలన

● బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

సిరిసిల్ల జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీ సోదరులే రేవంత్‌రెడ్డికి బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లాకార్యాలయ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతి బీరకాయలో నేతి ఎలాగ లేదో కాంగ్రెస్ బీసీడిక్లరేషన్‌లో చిత్తశుద్ధి కూడా గంతే అని అన్నారు. బీసీలను మరోసారి ఘరానా మోసం చేస్తున్నాడన్నారు. గతంలో అసెంబ్లీలో రేవంత్ రెడ్డి స్వయంగా 42శాతం రిజర్వేషన్ విద్య, ఉపాధి, రాజకీయాల్లో రావాలంటే పార్లమెంట్ ఆమోదం కావాలని, రాష్ట్రపతి సంతకం పెట్టాలని మాట్లాడాడన్నారు. రేవంత్‌రెడ్డి కాగితం ఇస్తే.. బీజేపీ గవర్నర్‌కు ఆర్డినెన్స్ ఇస్తేకాదని రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్లో పొందుపరిస్తేనే చట్టబద్ధత వస్తుందన్నారు. గోదావరి, కృష్ణజలాల్లో తెలంగాణ వాటా, హక్కులు తేల్చకుండా కమిటీ వేద్దామని అనగానే తల ఊపడానికి గోదావరి నీళ్లు రేవంత్‌రెడ్డి అబ్బసొత్తు కాదు, తాత జాగిరి కాదని అన్నారు. ఎవరిని అడిగి ఢిల్లీలో కమిటీకి ఒప్పుకొని వచ్చావు.. చంద్రబాబు మీద ప్రేమ ఉంటే నీ ఇల్లు అమ్మి విగ్రహం పెట్టుకోవాలని అన్నారు.

తెలంగాణకు రావల సిన గోదావరి, కృష్ణ జలాల వాటా తేలకుండానే గోదావరి జలాలు చంద్రబాబుకు తర్పణం చేయడంపై తెలంగాణ ప్రజలు ఆక్రోశిస్తున్నారన్నారు. 48గంటలముందు బనకచర్ల అంశంపై వెళ్లబోమని చెప్పినా 24గంటల్లోనే చంద్రబాబు నాయుడును కలవడానికి ఢిల్లీ వెళ్లి ఎవరి అబ్బ సొత్తని, నీ తాత జాగిరి అని గోదావరి జలాలపై తల ఊపి వచ్చావని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల్లో చైతన్యం ఉందని, కేసీఆర్, బీఆర్ఎస్ ఉందనే విషయం మర్చిపోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో చంద్రబాబు కోవర్టు పాలన నడుస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌పార్టీకి ఉప్పు పాతరవేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బనకచర్లను తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని దానికి అనుకూలంగా వైఖరిమార్చుకోవాలని లేదంటే తెలంగాణ ఉద్యమంలాగానే మరో ఉద్యమం తప్పదన్నారు.

నోటుకు ఓటు కేసు ఉందని చంద్రబాబు ఫుట్‌బాల్ లాగా ఆడిస్తామంటే వ్యతిరేకిస్తామన్నారు. కేసీఆర్ మీద కోపంతో కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయకుండా మిడ్ మానేరు ప్రాజెక్టును ఎండబెట్టి పంటలకు నీళ్లు ఇవ్వకుండా ఎండబెడుతున్నారన్నారు. సమావేశంలో నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీ మాజీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాంమోహన్, మాజీ జడ్పీ టీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, నాయ కులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

తిమ్మాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటవద్ద గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండుట్రాక్టర్లు, రెండు పికప్‌వాహనాలను పట్టుకున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. పట్టుకున్నవాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాలకు సంబంధించిన యాజమానులు, డ్రైవర్లు అయిన గీకురు అజయ్, గూడెల్లి అనిల్, అలువల కిషన్, కర్ర రాజు, కనకుంట్ల వినయ్, బొంగోని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు పట్టుకున్న వాహనాలు

## సాగునీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో



పొత్తూరు వంతెనపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటిని విడుదల చేయాలంటూ మండలంలోని పలు గ్రామాల రైతులు రాస్తారోకో చేపట్టారు. మధ్యమానేరు కుడికాలువ ద్వారా సాగునీటిని అందించాలని డిమాండ్ చేస్తూ పొత్తూరు గ్రామసమీపంలోని వంతెనపై గురువారం రైతులు నిరసనకు దిగారు. రైతుల నిరసనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు మాట్లాడుతూ సరైన వర్షాలు కురియకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొంతమంది రైతులు ఇప్పటివరకు నాట్లు వేయలేదని, మరికొందరి రైతుల చేన్లు ఎండిపోతున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడు ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదన్నారు. రైతులు కోరినప్పుడు నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రైతులు అనేక రోజులుగా సమస్యను వివరిస్తున్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ ఇప్పటికైనా స్పందించి కుడికాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మధ్యమానేరును ముట్టడిస్తామన్నారు. దాదాపు రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టడంతో వంతెనపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో శాంతించి నిరసన విరమించారు. కార్యక్రమంలో నాయకులు కేవీఎస్‌రెడ్డి, సిద్ధం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్‌లతో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మెడలు వంచి రూ.6వేల పింఛన్ సాధిస్తాం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మెడలువంచి దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, గీత, చేనేత, బీడీ కార్మికులకు రూ.4వేల చేయూత పింఛన్ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని కళాభారతిలో వచ్చేనెల13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాగర్జన సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు అయ్యిందని, ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు రూ. 6వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదని, దీంతో దివ్యాంగులు, చేయూత పింఛన్ దారులు నెలకు రెండువేల చొప్పున ఒక్కొక్కరు ఇప్పటి వరకు 40వేల రూపాయలను నష్టపోయారని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఈ అంశాన్ని మేనిఫెస్టోలో పొందుపర్చుకున్నా అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి అమలు చేయించినట్లు చెప్పారు. కండరాల నొప్పితో బాధపడుతున్నవారికి ఏపీలో నెలకు పదివేల రూపాయలు పింఛన్ ఇస్తున్నారన్నారు. దివ్యాంగుల, చేయూత పింఛన్ పెంచకుండా ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి మళ్లించిందని ఆరోపించారు. కళ్లు, కాళ్లు లేనివారికంటే భూములుఉన్నవారికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చినమాట తప్పిందని, దానిని ప్రతిపక్షం నిలదీయడం లేదని అన్నారు. అందుకే తాను ముందుకువచ్చినట్లు చెప్పారు. తానుపేదరికం నుంచి వచ్చానని, పేదలబతుకులు, బాధలు తనకు తెలుసని అన్నారు. తన పోరాటంతోనే దివ్యాంగులకు నెలకు రూ.1,500పింఛన్, ఆరోగ్యశ్రీపథకం సాధించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న పింఛన్ ఆగస్టునుంచి అమలు చేయాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం

● ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్

బోయినపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఏడాదికి లక్షా యాభై వేల రూపాయల వరకు నికర ఆదాయం పొందవచ్చని ఉద్యానశాఖ డిప్యూటీడైరెక్టర్ టి శేఖర్ తెలిపారు. బోయిని పల్లి మండలం మర్లపేటలో ఆయిల్‌పామ్ తోటలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. ఈ పంటతో మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి రైతుకు కేవలం రూ.20కే మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎకరాకు రూ.4200వరకు సబ్సిడీ మంజూరవుతుందని వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా విస్తృతంగా రాయితీలు అందుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీ, చిన్నకారు రైతులకు 90శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీ లభించనుందని చెప్పారు. జిల్లాలో నీటి వనరులు, నేల తేమ అందుబాటులో ఉన్నాయి. ఆయిల్‌పామ్ పంటకు ఇవి అనుకూలంగా ఉంటాయి. కాబట్టి రైతులు ముందుకువచ్చి ఈ సాగు చేపట్టాలని శేఖర్ రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయిల్ పామ్ గెలల కోతను పరిశీలించిన ఆయన, పంట దిగుబడి, మార్కెట్‌అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్‌సాగు ద్వారా రైతుల ఆర్థిక స్థితిలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లత మాట్లాడుతూ జిల్లాకు ఈ సంవత్సరం ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం 2000 ఎకరాలు, అయితే ఇప్పటికే పెద్దఎత్తున రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లోకేష్, గోవర్ధన్, ఏఓ ప్రణీత, ఫ్రీయూనిక్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ గెలలతో అధికారులు

## నవోదయ పరీక్షకు దరఖాస్తు గడువు 29

చొప్పదండి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల29న ముగుస్తుందని ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్13న జాతీయ స్థాయిలో ప్రవేశపరీక్ష జరుగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులని ఆమె తెలిపారు.

## రూ.7700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ముగ్గురు రైతులు 34క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7700, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

## 20న ఉమ్మడి జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు పోటీలు

మార్కండేయకాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు అర్హులైన అభ్యర్థులకు ఈనెల 20న గోదావరిఖని ఫైటింక్లయిన్‌కాలనీలోని ఏపీజే అబ్దుల్ కలాం స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఫుట్‌బాల్ కిట్‌తో ఉదయం 7గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9550903088, 9908839896 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొలిపాక రమేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాని పరిచయం చేసుకొని వెంటపడి మోసగించాడు. పెళ్లి చేసుకోవాలని యువతి రమేష్‌ను కోరగా నిరాకరించాడు. దీంతో సదరు యువతి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన మామిడి రాజయ్య భూ తగాదాలో అదే గ్రామానికి చెందిన వావిలాల సత్తయ్యపై పారతో దాడిచేశాడు. దీంతో సత్తయ్యకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. సత్తయ్య భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## గుడుంబా తయారీదారుల బైండోవర్

ముత్తారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి, మచ్చుపేట, తెనుగుపల్లి గ్రామాలలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గతంలో నాటుసారా అమ్ముతూపట్టుబడిన సిద్ధరాజేశ్వరి, నల్లాల నందు, నక్క రమేష్, నలివేల ప్రసాద్‌లను తహసీల్దార్ ఎదుట లక్షరూపాయల వ్యక్తిగత పూచికత్తుతో బైండోవర్ చేశారు.

## ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

కాల్వశ్రీరాంపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం గ్రామంలో పులిపాక సంపత్(32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పులిపాక సంపత్ స్వగ్రామం కమాన్‌పూర్ మండలం రొంపికుంట కాగా, కూనారం గ్రామానికిచెందిన దొడ్ల రాజేశ్వరిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. అతడిమృతిపై పలుఅనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులను వివరణ కోరగా మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని వారు పేర్కొన్నారు.

## అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నంమండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వెంగళ పోచమ్మ(42) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఈనెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలు పోచమ్మ భర్త సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేష్(ఫైల్)

ఎలిగేడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి నరేష్(34)చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రామచంద్రం తెలిపారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన నరేష్ ఈ నెల 15నగ్రామసమీపంలోని కోమటికుంట వద్ద మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పడంతో అతని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పేర్కొన్నారు. భార్య లావణ్య, కొడుకు రిషిత్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చింతన

# అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలా మంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

### తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



### ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220

ఆలయ దర్శనం



# యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



### వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

**ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.**

### అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎస్.మూర్తి
8328143489

సందేశం


# కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

# భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

**భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.**

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



### అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

### అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

# అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తాకోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్థులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,



**అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.**

వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

# మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కొషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి.... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క అతను వెళ్ళి పోతూ ఉంటే... రోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్షిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

## విద్యార్థుల అపార్ పుట్టిన తేదీ సమస్యలను పరిష్కరించాలి

రాయికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఐడీల జనరేషన్ నేపథ్యంలో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీలు మార్పులు, చేర్పుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీపీఎంఎస్‌ఈయూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ గురువారం సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం పంపించారు. మార్పులకు ప్రభుత్వం అనుమతించడంతో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల అభీష్టం మేరకు అడ్మిషన్ రిజిష్టర్‌లో, యూడైస్‌లో అవసరమైన పదో తరగతి, అన్ని తరగతుల విద్యార్థుల పుట్టిన తేదీలు, పేర్లు మార్పులు చేయాలన్నారు. సదరు వివరాల అప్‌డేట్‌కు సంబంధించిన రికార్డుల ధ్రువీకరణ పత్రాలు, సంబంధిత మండల, జిల్లా విద్యా శాఖాధికారుల ద్వారా ఎస్సెస్సీ బోర్డు హైదరాబాద్‌కు పంపించారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ - సమస్యల పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు. అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని బలోపేతం వస్తామని గొప్పలు పలికి, గద్దెనెక్కాక హామీని విస్మరించిందన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్‌కేఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మాణం చేపట్టాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాధ్యులు చందు, రాకేష్, చంటి, నిఖిల్, అనూష, ప్రవల్లిక విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రోత్సాహానికి తప్పని ఎదురుచూపులు

(5వ పేజీ తరువాయి)

సంబంధిత శాఖ అధికారులు విచారణ చేసి అర్హులని తేలితే ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. వివాహం చేసుకున్న దంపతులు మూడు ఫొటోలు, కులం, వయసు ధ్రువీకరణ పత్రాలు విద్యాసంస్థల నుంచి తీసుకున్న టీసీ, మార్కుల జాబితా, వివాహం చేయించిన అధికారి ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారుల నుంచి పొందిన ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్, దంపతులు కలిసి తీసిన బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలి. వివాహానికి సాక్షుల వివరాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు దరఖాస్తుతో జత చేయాల్సి ఉంటుంది.

**●దరఖాస్తులు ఎక్కువ, నిధులు తక్కువ....**

జిల్లాలో కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులు ప్రభుత్వ సాయం కోసం ఎక్కువగా దరఖాస్తులు చేసుకోగా, నిధులు తక్కువగా విడుదల చేయడం వల్ల అర్హులందరికీ అందడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా లక్ష నూటపదహారు రూపాయలను అందించడంతో కులాలు వేరైనా పెద్దలు ఒప్పుకుని పెళ్లి చేసుకున్న జంటలకు కల్యాణలక్ష్మి వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఒకే సామాజిక వర్గానికి చెందినవారు పెళ్లిళ్లు చేసుకున్న రోజుల నుంచి క్రమంగా మార్పులు చోటుచేసుకొని కులాలు, మతాలు వేరైనా ప్రస్తుతం పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. పలు కులాల్లో అమ్మాయిల నిష్పత్తి తక్కువగా ఉండడంతో పలువురు అబ్బాయిలకు పెద్దలు సైతం కులాంతర వివాహాలు జరిపిస్తున్నారు. మరికొంత మంది అబ్బాయిలు ఆదర్శ వివాహాలు జరుపుకుంటున్నారు.

**● నిధులు రాగానే సహాయం అందిస్తాం**

**- రాజు కుమార్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి**



ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రూ. 2.50 లక్షలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అర్హులైన జంటలు జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నాం.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

మెటపల్లిటౌన్/మెట్‌పల్లి రూరల్ జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు అన్నారు. గురువారం పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా మెట్‌పల్లి పట్టణం, మెట్‌పెల్లి మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, వేంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సభ్యత నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని హెల్త్ స్కీమ్ వర్తించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గంగాప్రసాద్ బాలకిషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మద్దిరాల గణేష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, సుధాకర్ జిల్లా ఉపాధ్యక్షుడు నడిగడ్డ రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలనీ పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాలా అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు చిన్నయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బాధ్యులు ఈగ శ్రీధర్ కుమార్, రాజేష్ మండల అధ్యక్షుడు జి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**వెల్గటూర్:** మండలంలోని వివిధపాఠశాలల్లో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదును నిర్వహించారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపండు నర్సింగం, శ్రీధర్‌రెడ్డి రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి సంతోష్ పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి

కోరుట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి, హానీకరం చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనంకు అందించాలని మున్సిపల్ కమీషనర్ రవీందర్ కాలనీ వాసులకు సూచించారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కాలనీ వాసుకు తడి, పొడి, హానీకర చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న పనులను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మురికి కాల్వలకు ఇరువైపుల పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరుచాలని సూచించారు. నిలువ ఉన్న నీటి వద్ద తొలగించిన భవన నిర్మాణాల నుంచి వ్యర్థాలతో పూడ్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఆవోపా ఆధ్వర్యంలో ఆషాఢ మాస తీర్థాలు

వెల్గటూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్ ఆవోపా యూనిట్ ఆధ్వర్యంలో గురువారం కిషన్‌రావుపేట నాగపెల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో ఆషాఢ మాస పోచమ్మ తీర్థాలు నిర్వహించారు. పోచమ్మ తల్లి, లక్ష్మి నరసింహస్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలకు, జంటలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు గుండా ప్రభాకర్, పల్లెర్ల శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు వొజ్జల రాజమౌళి, టౌన్ అధ్యక్షుడు కొత్త కిరణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొంజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

రాయికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బిట్ల నర్సయ్య జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. మొట్టమొదటిసారిగా గురువారం గ్రామానికి వచ్చిన నర్సయ్యను గ్రామ సేవాసమితి, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. నర్సయ్య అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కావడం ఆ గ్రామానికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సేవాసమితి కార్యవర్గ సభ్యులు, అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామ సీనియర్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

**జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్**

రాయికల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని కోరుతూ రైతులతో కలిసి పెద్దమ్మ తల్లి ఆలయం సమీపంలో నిరసన తెలిపారు. ప్రస్తుత దుర్భర పరిస్థితి చూస్తే కాలం కాటేసిన కరువులా లేదని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తెచ్చిన కరువేనని అన్నారు. రైతులను ఆదుకునేందుకు తక్షణమే ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి నీటి విడుదలకు బీఆర్ఎస్ పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయికల్ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్, కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉదయశ్రీ, మాజీ ఎంపీటీసీ దొంతి నాగరాజు, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండపల్కుల రత్నాకర్ రావు, మహేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు మారంపెల్లి సాయి కుమార్, కన్నాక మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగుల మహా గర్జనను విజయవంతం చేయండి

**● ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్**

కథలాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న హైదరాబాద్‌లో జరిగే వికలాంగుల మహా గర్జన సభకు తరలిరావాలని జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పల్లి లక్ష్మణ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో దివ్యాంగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు రు. 4 వేల ఫించన్‌ను 6 వేలు ఇస్తామని చెప్పిన నేపథ్యంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు ఇస్తూ ఆర్డినెన్స్ జారీ చేసి చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం 4 శాతం, ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. ఈ మేరకు ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించే సన్నాహక సమావేశంకు దివ్యాంగులు అన్ని మండలాల నుంచి హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మారంపల్లి వినోద్, కాశవత్తుల లక్ష్మీరాజం, నోముల రాజరెడ్డి, బైర నారాయణ, కంటె రాజం, రంజిత్, కోనయ్య ఉన్నారు.

**జగిత్యాలరూరల్:** ఈ నెల 27న జగిత్యాలలో జరిగే విక లాంగుల మహాగర్జనకు తరలిరావాలని ఎ మ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నక్క సతీష్ పిలుపునిచ్చారు. జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్‌లో గురువారం వికలాంగుల సమావేశం నిర్వహించారు. కా ర్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సయ్య, నియోజకవర్గ కోఇన్‌చార్జి సునీల్, వికలాం గులు అరుణ్, సంజీవ్ ఉన్నారు.

## మృతదేహం తెప్పించాలని కేంద్రమంత్రికి వినతి

మల్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న దుబాయిలో గుండెపోటుతో మృతిచెందిన తన భర్త బూస అంజయ్య మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని మండలంలోని ముత్యంపేటకు చెందిన బూస సుగుణ కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులతో కలిసి గురువారం కరీంనగర్‌లోని కేంద్రమంత్రి కార్యాలయంలో సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సామ మహిపాల్‌రెడ్డి, సంత శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్ర, వామన్‌రెడ్డి ఉన్నారు.

## ఎత్తయిన శిఖరాన్ని అధిరోహించిన మండల వాసి


సూర్య నమస్కారం చేస్తున్న ప్రవీణ్

మెట్‌పల్లి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలలోని ఎత్తయిన శిఖరాలను అధిరోహిస్తున్న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన మారుపల్లి ప్రవీణ్ మరో ఘనతను సాధించాడు. గుజరాత్‌లో 2000 అడుగుల ఎత్తులో ఉన్న దేవాత్రి శిఖరాన్ని గురువారం అధిరోహించి 25 నిమిషాలలో 108 సూర్య నమస్కారాలు చేసి పూర్తి చేసినట్లు ఆయన ఫోన్ ద్వారా తెలిపాడు. యాభై ఒకటవ శిఖరాన్ని పూర్తి చేసిన మరిపెల్లి ప్రవీణ్‌ను నాయకులు, గ్రామస్థులు అభినందనాలు తెలిపారు.

## 'వనమహోత్సవం'లో భాగస్వాములు కావాలి

మల్లాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో గ్రామస్థులు భాగస్వాములు కావాలని డీఆర్డీవో పీడీ రఘువరన్ అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపేట గ్రామశివారులో షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాటుతున్న మొక్కలతో భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన గాలి, ఫలాలు అందించిన వారమవుతామన్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ, ఇంటి ఆవరణాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు నాటేందుకు ప్రజలను భాగస్వాములు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికుమార్, తహసీల్దార్ రమేష్‌గౌడ్, ఆర్ఐ రాజేష్, ఐకేపీ సీసీలు, మహిళా సంఘం సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ఇబ్రహీంపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్, ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా గురువారం రోజున వర్షకొండ గ్రామ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుకను టిప్పర్‌లో ఇబ్రహీంపట్నం వైపు తరలిస్తుండగా రెవెన్యూ ఇనెస్పెక్టర్ రేవంత్‌రెడ్డి టిప్పర్‌ను పట్టుకొని ఫిర్యాదు చేశారన్నారు. యజమాని దండ్ల బాజాన్న, కోజన్ కొత్తూరు అను అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పాత దామరాజుపల్లి గోదావరి నది నుంచి ఇబ్రహీంపట్నం వైపు ట్రాక్టర్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇనెస్పెక్టర్ రమేష్ పట్టుకొని ఫిర్యాదు చేయగా ట్రాక్టర్ డ్రైవర్ మొగిలిపేట గ్రామానికి చెందిన పూజారి సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# న్యాయమూర్తిని సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు



న్యాయమూర్తి అరుణ్ కుమార్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ న్యాయ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని కోర్టులో న్యాయమూర్తి అరుణ్‌కుమార్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. కోర్టు భవనంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరీ విజయ్ అధ్వర్యంలో వేడుకలను నిర్వహించంగా లయన్ క్లబ్ సభ్యులు అసోసియేషన్ సభ్యులతో పాటు న్యాయమూర్తి అరుణ్ కుమార్, పీపీ ప్రణయ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రత్యేకం ఏర్పాటు చేసిన కేకును కట్టు చేసి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కోంపల్లి సురేష్, సదాశివ్, శ్రీనివాస్, రమేష్, సుతారి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు జీవన్ రెడ్డి, పోతని ప్రవీణ్ కుమార్, నల్ల గంగాధర్, మంచాల జగన్, సురేష్ బాబు, మహేష్ పాల్గొన్నారు.

**రాయికల్:** అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయవాదులను లయన్స్ క్లబ్ ఆఫ్ రాయికల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్, రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపెల్లి రంజిత్ కుమార్, న్యాయవాది, ప్రధాన కార్యదర్శి బొడుగం అంజిరెడ్డి, కోశాధికారి బెక్కం తిరుపతి, ఉపాధ్యక్షులు వాసం స్వామి, సూర్యంరెడ్డి, న్యాయవాదులు రాజేందర్, నిఖిల్, మల్లేష్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## నంగి దేవేందర్ రెడ్డిపై దాడి అమానుషం

కోరుట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఎన్ఆర్ఐ అడ్వైజ్ బోర్డు సభ్యుడు నంగి దేవేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచరులు దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణం లోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. ఎన్ఆర్ఐ పాలసీపై బహిరంగ చర్చకోసం వెళ్లిన దేవేందర్ రెడ్డిపై దాడిచేయడం విచారకరమని అన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి రూరల్:** గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్న ఉద్యమ నాయకుడు, ఎన్ఆర్ఐ అడవైజర్ కమిటీ మెంబర్ దేవేందర్‌రెడ్డిపై దాడి చేయడం సరికాదని నిజామాబాద్ పార్లమెంట్ మాజీ కోఆర్డినేటర్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వేంపేట గ్రామంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవేందర్‌రెడ్డిపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచరులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన మెట్‌పల్లి తహసీల్దార్

మెట్‌పల్లిటౌన్, జూలై17(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం నీత గురువారం కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నీత కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

## కేంద్ర మంత్రిని కలిసిన పద్మశాలి సంఘ సభ్యులు

కథలాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి పద్మశాలి సంఘ సభ్యులు కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను గురువారం కలిశారు. కాలనీలో సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. నిధుల మంజూరుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సత్యం, రంగు గంగారాం, సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

## కలికోటలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

కథలాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోట గిరిజన తండాలో గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గిరిజనుల సాంప్రదాయం ప్రకారం కొత్తగా మొలకెత్తిన వివిధ రకాల విత్తనాను తలపై పెట్టుకుని డప్పు చప్పుళ్లతో మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ అలరించారు. వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు రావాలని కోరుతూ తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలకు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, గాందారి శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

### సంక్షిప్తంగా..

**ధర్మపురి:** మండలంలోని దమ్మన్నపేటలో దూడ సతీష్ భార్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్‌రావు పరామర్శించారు.

**కథలాపూర్:** మండలంలోని పోసానిపేటలో అంగన్‌వాడీ ఆయా లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ప్రభుత్వం ప్రకటించిన తాత్కాలిక సాయం రూ. పదివేలను ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.

- కథలాపూర్ మండలంలోని దుంపెట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన జెల్ల శంకర్ అనే యువకుడు టై, బెల్టులు అందజేశారు.

- కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాలలో వేంకటేశ్వరస్వామి ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది.

**బుగ్గారం:** మండలంలోని అన్ని గ్రామాల ట్రాక్టర్ల యజమానులు బీటి రోడ్డుపై వెళ్లేటప్పుడు కేజీ వీల్స్‌కి పట్టీలు అమర్చుకొని వెళ్లాలని ఎస్సై సతీష్ సూచించారు.

**బుగ్గారం:** టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు పద్మశాలి ఆదేశాల మేరకు బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన కండ్లే అంజన్నను జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షుడిగా గురువారం నియమించారు.

**మల్యాల:** మండలంలోని లంబాడిపల్లి మార్కండేయ పద్మశాలి సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి సంఘ భవన నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

**కొడిమ్యాల:** ప్రభుత్వ భూమిని అనుమతి లేకుండా అక్రమంగా ఆక్రమించడానికి చదును చేసిన రెండు బ్లేడ్ ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కొడిమ్యాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ గురువారం తెలిపారు.

# గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు


ఊరేగింపుగా వెళుతున్న గంగపుత్ర సంఘం సభ్యులు

మెటపల్లి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మెటపల్లి పట్టణ గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం రేగుంట ఉడుగుల పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. గొల్లెండ్లతో ఊరేగింపుగా పట్టణ సంఘ భవనం నుండి పోచమ్మ ఆలయం, భూదేవి అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేసి పట్టణ వీధుల గుండా రేగుంట ఉడుగుల పోచమ్మ తల్లి ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించారు. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక పట్టణ అధ్యక్షుడు పర్రె శంకర్, గంగపుత్ర సంఘాల అధ్యక్షులు మాన్కాల చిన్నయ్య. ఆర్మూర్ నరేందర్. ఆర్మూర్ రాజేష్. పర్మి నర్సయ్య కుడుముల సాయన్న, పారిపెల్లి శంకర్, ఆర్మూర్ గంగారాం, మగ్గిడి సురేష్, వాల్గోట్ సాయిలు, పారేపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళాడిగ్రీ కళాశాలలో గోరింటాకు వేడుక


చేతులకు గోరింటాకుతో విద్యార్థినులు, అధ్యాపకులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు వేడుకను నిర్వహించారు. ఈ సంబరాలు ఎన్ఎస్ఎస్, హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, కళాశాల ఆవరణలో ఉన్న గోరింటాకు మొక్కల నుంచి గోరింటాకు సేకరించి, చేతులకు అలంకరించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, హెల్త్ క్లబ్ కో ఆర్డినేటర్ నీరజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంగీతారాణి, సుజాత, వాసవి, వరప్రసాద్, జమున, జ్యోత్స్న, సునీత, వీణ, రష్మిత, ఇర్ఫానా, యాస్మిన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొడిమ్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి) : బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీకార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కార్యకర్తలను కోరారు. గురువారం మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి, సింగిరెడ్డి, తిరుపతిరెడ్డి, నాంపెల్లి రాజేశం, వడ్లకొండ బుచ్చిరాములు, హరీష్, అరుణ్, రాజు, భూమేష్, సాయిబాబా, అంజి, అనిల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను ప్రతీ పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ సందర్శించి శిబిరానికి వచ్చిన వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. పెగడపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్, డాక్టర్ అనూష, సిబ్బంది జయశీల, కల్పన, రాజు, తిరుపతి, సంధ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బాసటగా మిత్రులు

మల్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత మే నెలలో పోలాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్ కుటుంబానికి అతని మిత్రులు బాసటగా నిలిచారు. పోలాండ్‌కు వెళ్లిన వలస కార్మికులు, తెలంగాణ యూరప్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గడుగు గంగనర్సయ్య, రమేశ్, సాగర్, రాయనవేని అశోక్, ఆకుల శ్రీనివాస్, మల్యాల సుమన్ తదితరులు పోలాండ్‌లో విరాళాలు సేకరించి పంపగా గురువారం మనోజ్ కుటుంబసభ్యులకు రూ.1,56,820 అందజేశారు. కార్యక్రమంలో దొంతరవేని శేఖర్, గంగాధర్, గుడిసె అలంకార్, ఆకుల సుమలత, కీసరి గణేశ్, వంగలి శ్రీను, రవి, రఘు, అనిరుద్, రవి, లక్ష్మణ్ , నీలం నారాయణ పాల్గొన్నారు.